



ఆనందం.. విషాదం



జిల్లా ప్రజలు గురువారం రాత్రి దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఏలూరులో బైక్‌పై మూటకట్టి తీసుకువెళుతున్న ఉల్లి బాంబులు పేలి.. ఒకరు మృతి చెందగా ఎనిమిది మంది గాయపడడంతో విషాదం నెలకొంది. 5లో..

కార్తీకం.. శివోహం

నేటి నుంచి కార్తీక మాసం మొదలైంది. నెల రోజులపాటు శైవక్షేత్రాలు శివ నామ స్మరణతో మార్మోగనున్నాయి. ఆలయాన్నీ విద్యుత్ దీప కాంతులతో ముస్తాబయ్యాయి. శనివారం ఉదయం భక్తులు పుణ్య నదీ స్నానాలు ఆచరించనున్నారు. ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. 4లో..



విద్యుత్ వెలుగుల్లో భీమవరం సోమేశ్వరస్వామి ఆలయం



దీపం పథకం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ రామ్మోహన్, కలెక్టర్ నాగరాణి

48 గంటల్లో గ్యాస్ రాయితీ సొమ్ము జమ : మంత్రి నిమ్మల

పాలకొల్లు రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి):అర్హులైన పేదలందరికీ దీపం పథకం-2లో ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు మండలం పూలపల్లిలో శుక్రవారం సాయంత్రం ఈ పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. బుక్ చేసుకున్న 24 నుంచి 48 గంటల్లోపు సిలిండర్ పంపిణీ చేస్తారని, 48 గంటల్లో గ్యాస్ రాయితీ సొమ్మును బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేస్తామని చెప్పారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి గ్యాస్ సిలెండర్లను లబ్ధిదారులకు అందజేశారు. పథకం పూర్తి వివరాలను కలెక్టర్ వివరించారు. ఆర్డీవో దాసి రాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ శివరామప్రసాద్, డీఎస్‌వో ఎస్.సరోజ పాల్గొన్నారు. తొలిరోజు నాలుగు వేల మందికి సిలిండర్లు పంపిణీ చేశారు.

ఇళ్లకు వెళ్లి కలెక్టర్ పింఛన్ పంపిణీ



ఎన్‌ఆర్పీ అగ్రహారంలో పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్/ఉండి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి):జిల్లాలో 2.33 లక్షల మంది లబ్ధిదారులకు రూ.96 కోట్ల పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టరు నాగరాణి వెల్లడించారు. శుక్రవారం ఉండి మండలం ఎన్‌ఆర్పీ అగ్రహారంలో నవంబరు నెల పెన్షన్ల పంపిణీకి ఆమె శ్రీకారం చుట్టారు. అనారోగ్యంతో బాధపడుతున్న పాలపర్తి ప్రకాశం ఇంటికి వెళ్లి రూ.15 వేలు, దివ్యాంగురాలు పాలపర్తి పోలమ్మకు రూ.6 వేలు, వయో వృద్ధులు మద్దా రామారావు, మోర జయరాజు, వితంతువు మల్ల గిరి దానమ్మలకు రూ.4 వేలు చొప్పున పింఛన్లు అందించారు.తహశీల్దారు నాగార్జున, ఎంపీడీవో రవీంద్ర, సర్పంచ్ కనకదుర్గ వెంకటాచార్యులు, ఎంపీటీసీ మున్నలూరి సువర్ణ లక్ష్మీశ్రీను తదితరులు పాల్గొన్నారు. 2,16,777 మంది లబ్ధిదారులకు శుక్రవారం పింఛన్లు అందించారు. మిగిలిన 12,407 మందికి శనివారం అందిస్తామని అధికారులు తెలిపారు.

పింఛన్ల పంపిణీకి సర్వర్ సమస్యలు

ఆకివీడు/మొగల్తూరు/కాళ్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి):పింఛన్ల పంపిణీలో మొదటిరోజు సర్వర్ సమస్యలు తలెత్తాయి. పంపిణీ ఉదయం ఏడు గంటలకు మొదలైనా గంట తర్వాత సర్వర్లు మొరాయించాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తిరిగి పనిచేయడంతో పింఛన్ల పంపిణీ సజావుగా సాగింది. పింఛన్ల పంపిణీకి అధికారులు రాకపోవడంతో వృద్ధులు కంగారుపడి కాళ్ల మండలంలో పలుచోట్ల సచివాలయాలకు క్యూ కట్టారు. సర్వర్ సమస్య ఉందని అధికారులు చెప్పినా పింఛనుదారులు గంటల తరబడి నిరీక్షించారు. పింఛన్లు తీసుకున్న తర్వాతే ఇళ్లకు వెళ్లారు.



ఐఎస్ జగన్నాథపురంలో మూలవిరాట్‌ను దర్శించుకుంటున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



బహిరంగ సభలో మాట్లాడుతున్న పవన్, చిత్రంలో మంత్రి దుర్గేశ్, కలెక్టర్ వెట్రి సెల్వి, ఎమ్మెల్యేలు వెంకట్రాజు, ధర్మరాజు తదితరులు

నరసింహుడే.. నడిపించాడు

పద్నాలుగేళ్లు సుదీర్ఘ పరీక్ష పెట్టారు

ఐఎస్ జగన్నాథపురంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

'నేను త్రికరణశుద్ధిగా నమ్మి ఆరాధించిన జగన్నాథపురం లక్ష్మీ నరసింహుడే నన్ను విజయపథాన నడిపించాడు. ఇటువంటి మహత్తర పుణ్య క్షేత్రానికి తగినన్ని హంగులు కల్పించడమే కాదు పర్యాటకంగా తీర్చిదిద్దాలని నిర్ణయించాన'ని పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ ప్రకటించారు. ఆ మేరకు ఆయన లక్ష్మీనరసింహుని కొండపై ప్రత్యేకంగా యాగం చేశారు. అర్చకుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై ఉన్నతాధికారులతో కొంతసేపు ముఖాముఖి చర్చించారు. ద్వారకా తిరుమల మండలం ఐ.ఎస్.జగన్నాథపురానికి శుక్రవారం విచ్చేసిన ఆయన దీపం-2 గ్యాస్ సిలిండర్లను పంపిణీని ఆయన ప్రారంభించారు. తర్వాత జరిగిన సభలో ఆయన లక్ష్మీనరసింహస్వామికి తనకున్న అనుబంధాన్ని బయటపెట్టారు. 'ఈ ఊరు మా గురువు గారిది. శక్తివంతమైన నేల. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని నేను పదేపదే ఇక్కడి లక్ష్మీనరసింహస్వామికి మొక్కాను. 2009లో తొలిసారి స్వామిని దర్శించి నాకు తగినంత శక్తినివ్వాలని కోరుకున్నా. స్వామి అంత తేలిగ్గా కటాక్షించరు. పద్నాలుగేళ్ల పరీక్ష పెట్టారు. చిమ్మచీకట్లో నేను ఎటు వెళ్తున్నానో తెలియని పరిస్థితి. ఎక్కడా వెలుతురు లేదు. దీపం వెలిగిస్తే ఆ వెలుగే అత్యద్భుతం. అత్యంత బలమైనది. ఇక్కడా అదే జరిగింది. ఎన్‌డీఏను నిలబెట్టేటంత స్థాయికి స్వామి తీసుకెళ్లారు' అంటూ తన జ్ఞాపకాలను ప్రజల ముందుంచారు. ఆలయ అభివృద్ధికి అధికారులతో మాట్లాడిన తర్వాత కొన్ని నిర్ణయాలు తీసుకున్నట్టు చెప్పారు. గుడి ప్రాకారం పనులకు మూడు నెలల సమయం పడుతుందని కలెక్టర్ వెట్రి సెల్వి చెప్పినట్లు తెలిపారు. చిక్కుల్లో ఉన్న ఆలయ పరిధిలోని 50 ఎకరాల భూమిని మ్యూటేషన్ జరిపి ఎండోమెంట్‌కు అప్పగిస్తామన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు ఈ నేలే నన్ను ప్రేరేపించిందని పవన్ చెప్పారు. అంతకుముందు అధికారులతో ఈ ఆలయానికి సంబంధించి అభివృద్ధి, సంక్షేమంపై ఏమేమి చర్యలు తీసుకోవాలో పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీకృష్ణ తేజ, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కొమ్మి శివప్రతాప కిశోర్, జేసీ ధాత్రిరెడ్డిలతో సుదీర్ఘంగా సమావేశమయ్యానని చెప్పారు. ఇక్కడ ఉన్న కొండ భూమిని సమీపాన ఉన్న హైవే నిర్మాణానికి వినియోగిస్తున్నామని చెప్పి భారీగా తవ్వుకుపోతున్నారని, అసలు ఈ కొండ తవ్వకం ఎవరు చేస్తున్నారు, ఎందుకు చేస్తున్నారు, నిజంగానే హైవే నిర్మాణానికి చేస్తున్నారా నిగ్గు తేల్చాలని అధికారులను కోరారు. వారంలోగా నివేదిక సమర్పించాల్సిందిగా కలెక్టర్‌కు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దేవదాయ శాఖ పరిధిలోని ఆస్తుల రక్షణపై దృష్టి పెట్టాలని, అన్యాక్రాంతమైన భూమెంతనే వివరాలు తనకు తెలపాలని దేవదాయ శాఖ కమిషనర్‌కు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా గోతులున్న రోడ్లను పూడ్చి వేసేందుకు శనివారం నుంచి ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు మంత్రి పవన్ ప్రకటించారు. జగన్ ఖజానాను ఖాళీ చేస్తే చంద్రబాబు, పవన్, మోదీ పట్టాలు తప్పిన ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కించినట్లు మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. దీపం-2 పథకం ఆరంభానికి ఉప ముఖ్యమంత్రి పవన్ ఇక్కడకు రావడం చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు.

అభిమానుల సందడి

పవన్‌ను చూసేందుకు అభిమానులు, జనసేన కార్యకర్తలు పోటీలు పడ్డారు. మండుటెండను లెక్క చేయకుండా భారీగా సభాస్థలికి తరలివచ్చారు. తమకు న్యాయం చేయాలని ప్లకార్డులు చూపిన జి.కొత్తపల్లికి చెందిన వారి వద్దకు మంత్రి పవన్ పీఏ స్వయంగా వెళ్లి ఆరా తీశారు. మూత్ర పిండాలు, లివర్ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న తమకు న్యాయం చేయాలని వారు కోరడంతో న్యాయం చేస్తానని సభావేదిక మీద పవన్ ప్రకటించారు. మంత్రి కొలుసు పార్థసారధి, జడ్పీ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీప్రసాద్, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, చిర్రి బాలరాజు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత సిలిండర్‌ను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్, మంత్రి దుర్గేశ్, ఎమ్మెల్యేలు మద్దిపాటి, బాలరాజు, పార్టీ అధ్యక్షుడు గోవిందరావు





ఓ షాపులో కమిషనర్ తనిఖీ

భీమవరంలో ప్లాస్టిక్ నిషేధం అమలు

భీమవరం టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి):భీమవరంలో ప్లాస్టిక్ నిషేధం అమల్లోకి వచ్చింది. శుక్రవారం ఉదయం మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, పారిశుధ్యం అధికారులు, సిబ్బంది మావుళ్లమ్మ ఆలయ పరిసరాల్లోని షాపులను తనిఖీ చేశారు. పలువురు వ్యాపారులకు తొమ్మిది వేల రూపాయల జరిమానా విధించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణ షాపుల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు అమ్మినా, ఇచ్చినా చర్యలు తీసుకుంటామన్నారు. మొదటిసారి దొరికితే జరిమానా విధిస్తామని, రెండోసారి వ్యాపారి లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఇకపై రోజూ తనిఖీలు చేస్తామని చెప్పారు. అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు

దీపావళి పండుగ సందర్భంగా జిల్లాకు వచ్చిన ప్రయాణికులు తిరిగి హైదరాబాద్ వెళ్లేందుకు వీలుగా ఆదివారం ఏడు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు. రోజూ వెళ్లే 14 సర్వీసులకు ఇవి అదనం. భీమవరం నుంచి రెండు, నరసాపురం రెండు, తణుకు రెండు, తాడేపల్లిగూడెం రెండు సర్వీసులు పంపుతున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు.

పంటును పంపిద్దాం

ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన

నరసాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం నీటిపారుదల శాఖ నుంచి నాలుగేళ్ల క్రితం నరసాపురం తీసుకువచ్చిన పంటును తిరిగి వారికి అప్పగించాలని మండల పరిషత్ అధికారులు నిర్ణయించారు. గత నెల 25న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'తుప్పు ప్రయాణం' కథనానికి అధికారులు స్పందించారు. గతంలో దీనిని తీసుకొచ్చే సమయంలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని.. అవి ఎదురుకాకుండా నిడదవోలు పంట కాల్వ ద్వారా ధవళేశ్వరం చేర్చాలని నిర్ణయించారు. కాల్వలోను, గట్లపైన పిచ్చి మొక్కలు అవరోధం కాకుండా ముందుగా వాటిని తొలగించనున్నారు. సోమవారం నరసాపురం నుంచి పంటు బయలుదేరుతుందని ఎంపీడీవో రామకృష్ణంరాజు చెప్పారు.



పెండింగ్ బిల్లులపై ఏం చేద్దాం..?

- కూటమి ప్రభుత్వం వచ్చినా బకాయిలా..?
- పట్టణాల్లో అభివృద్ధి పనులపై ప్రభావం
- మంత్రి, ఎమ్మెల్యేలను కలవాలని నిర్ణయం

నరసాపురంలో కాంట్రాక్టర్ల ఆవేదన

మున్సిపాలిటీ.. బకాయిలు : ■ భీమవరం రూ.12 కోట్లు.. ■ టీపీ గూడెం రూ.7.8 కోట్లు ■ తణుకు రూ.7.7 కోట్లు.. ■ పాలకొల్లు రూ.6.8 కోట్లు ■ నరసాపురం రూ.6 కోట్లు.. ■ ఆకివీడు రూ.50 లక్షలు

నరసాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వస్తే బిల్లుల సమస్య ఉండదని ఎదురుచూసిన కాంట్రాక్టర్లకు నిరాశే మిగిలింది. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా.. చేసిన పనులకు ఇంత వరకు బిల్లులు మంజూరు చేయలేదు. ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వం చివరిసారిగా బిల్లులు ఇచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అత్యవసరమైన బిల్లులకు కూడా మోక్షం లభించడం లేదు. ఇప్పటికే అప్పుల ఊబిలో కురుకుపోయిన వీరంతా శుక్రవారం భవిష్యత్ కార్యాచరణపై నరసాపురం మునిసిపల్ కార్యాలయంలో సమావేశమయ్యారు. పేరుకుపోయిన ఈ బకాయిలను ఏ విధంగా రాబట్టుకోవాలన్న దానిపై గంటపాటు చర్చించారు. ఎమ్మెల్యే నాయకర్, మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలో గడపగడప మన ప్రభుత్వం (జీజీఎంపీ) సీఎండీఎఫ్ అంటే చీఫ్ మినిస్టర్ డవలప్‌మెంట్ పనులు, బీపీఎల్‌ఆర్ బిల్డింగ్ పీనలైజేషన్ రెగ్యులర్ ఫండ్, జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులతో పురపాలక పరిధిల్లో పలు అభివృద్ధి పనులు చేశారు. గత ప్రభుత్వం మార్చి వరకు ఉన్న కొన్ని బిల్లులను క్లియర్ చేసింది. ఎన్నికల కోడ్ రాకతో చాలా బిల్లులు పెండింగ్‌లో పడ్డాయి. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత జనరల్ ఫండ్, ఆర్థిక సంఘం నిధులతో పలు పనులు చేశారు. మార్చి తర్వాత ఇప్పటి వరకు చేపట్టిన పనులకు సంబంధించి ఒక బిల్లు క్లియర్ కాలేదు.

మునిసిపాల్టీలో ఆయిల్, టెలిఫోన్, కరెంట్ నిర్వహణ ఖర్చుల బిల్లులు క్లియర్ కావడం లేదు. దీంతో పురపాలక సంఘంలో పనిచేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. కనీసం ఒక్క బిల్లు అయినా.. క్లియరైతే ప్రభుత్వం నుంచి సొమ్ములు వస్తాయన్న నమ్మకం ఉంటుందని భావిస్తున్నారు. కాంట్రాక్టర్లు అప్పులు తెచ్చి పనులు చేపట్టారు. ఇప్పటికే వడ్డీలు పెరిగిపోయాయి. కనీసం కొంత మొత్తమైనా విడుదలైతే వడ్డీలన్నా కట్టి మళ్లీ పనులు చేయాలనే ఆలోచనలో పడ్డారు. గత నెలాఖరు వరకు ఎదురుచూసినా నిరాశే మిగిలింది. ఈ నేపథ్యంలో నరసాపురం పురపాలక సంఘంలో పనులు చేసిన కాంట్రాక్టర్లంతా సమావేశమయ్యారు. వీరిలో చాలా మందికి రూ.50 లక్షలపైనే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మరికొందరికి రూ.20 లక్షలపైనే బిల్లులు రావాల్సి ఉన్నాయి. సమావేశమైన వారిలో అడబాల బాబులు, గోరు సత్తిబాబు, పార్థసారధి, జక్కం కాశీ, వల్లభానేని శేఖర్, నాని, దొరబాబు, త్రినాద్, మనోహర్ పాల్గొన్నారు.

అత్యున్నతంగా ఉద్యాన వర్సిటీ



'ఉద్యాన విశ్వ విద్యాలయం ఐదేళ్లుగా ర్యాంకింగ్స్‌లో 40 స్థానాలకు దిగజారింది. రాబోయే రోజుల్లో అత్యున్నతంగా తీర్చిదిద్దాలి. నేను బాధ్యతలు చేపట్టగానే అర్హతను బట్టి ఉన్నతాధికారులకు పోస్టింగ్‌లు ఇచ్చా'నంటున్నారు. ఉద్యాన విశ్వ విద్యాలయం వీసీ డాక్టర్ కురుబా గోపాల్ 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. -4లో..

టీడీపీ–జనసేన నేతల కొట్లాట

పైడిచింతపాడులో ఉద్రిక్తం

పింఛన్ల పంపిణీలో పరస్పర దాడులు 5



సమన్వయం కుదిర్చేనా?

- నేడు ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి భీమవరం రాక
- టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో సమావేశం
- జిల్లా అభివృద్ధిపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష

(భీమవరం-ఆంధ్రజ్యోతి):

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నేతృత్వంలో సమావేశం కానున్నారు. ఇన్‌ఛార్జ్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత శనివారం తొలిసారి భీమవరం రానున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు భీమవరంలో రహదారుల మరమ్మతులకు మంత్రి శంకుస్థాపన చేస్తారు. తర్వాత టీడీపీ ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహిస్తారు. మల్టీఫ్లెక్స్‌లోని కల్యాణ మండపంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో, రాష్ట్ర ప్రతినిధులు, సమన్వయ సమావేశం నిర్వహిస్తారు. కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మూడు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొంటారు. కూటమి బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహంపై దిశా నిర్దేశం చేస్తారు. జిల్లా అభివృద్ధిపై మధ్యాహ్నం రెండు గంటలకు కలెక్టరేట్‌లో రవికుమార్ సమీక్ష నిర్వహిస్తారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొంటారు. సమస్యలపైన, సంక్షేమ పథకాల అమలు తీరుపైన చర్చిస్తారు. జిల్లా ఇసుక ప్రధాన సమస్యగా మారింది. ప్రభుత్వం ఉచిత ఇసుకను అమలు చేస్తున్నప్పటికీ ధరలు అందుబాటులోకి రావలేదు. దీనివల్ల నిర్మాణ రంగం కుదేలైంది. అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. ఈ సమస్యను మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లాలని కూటమి నాయకులు నిర్ణయించారు. ముఖ్యంగా దీనిపై చర్చించనున్నారు.

నామినేటెడ్ పదవులపై ఆశ

ఇన్‌చార్జ్ మంత్రి పర్యటన ఖరారు కావడంతో కూటమి నేతల్లో నామినేటెడ్ పదవులపై ఆశలు రెకెత్తాయి. పదవుల పంపకంపై సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు ఒక స్పష్టత ఇచ్చారు. సహకార సంఘాలల్లో ద్విసభ్య కమిటీల ఏర్పాటు, నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్నారు. వీటితోపాటు ఇతర పదవులపైన ఇన్‌చార్జ్ మంత్రి సమక్షంలో మూడు పార్టీల మధ్య స్పష్టత వస్తుందని ఆశిస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో కూటమి నాయకుల మధ్య స్పర్థలు కనిపిస్తున్నాయి. ఆదిలోనే వీటిని పరిష్కరించకపోతే ఇవి మరింత ముదిరే అవకాశం వుంది. ఎన్నికల్లో కూటమి పార్టీల, అభ్యర్థుల గెలుపు కోసం అంతా కలిసి పనిచేశారు. కాని, ఎన్నికల అనంతరం సయోధ్య కనిపించడం లేదు. గత ఎన్నికల్లో వైసీపీకి పనిచేసిన నాయకులు ఇప్పుడు కూటమిలో ఏదో పార్టీ పక్షన చేరి పెత్తనం చెలాయిస్తున్నారు. ఇది కూటమి తరఫున కష్టపడిన వారికి ఇబ్బందిగా మారింది. నియోజకవర్గ నేతల మధ్య స్పర్థలకు దారి తీస్తోంది. వీటిపై ఇన్‌చార్జ్ మంత్రి దృష్టి సారించి దిశా నిర్దేశం చేయాల్సి వుంది.

అత్యున్నత వర్సిటీగా తీర్చిదిద్దుతా..

'ఆంధ్రజ్యోతి'తో ఉద్యాన వర్శిటీ ఉపకులపతి డాక్టర్ గోపాల్

ఇంటర్వ్యూ..



ఉద్యాన విశ్వవిద్యాలయం అయిదేళ్లుగా దేశంలోని ర్యాంకింగ్స్‌లో 40 స్థానాలకు పైగా దిగజారిపోయింది. అలాంటి వర్శిటిని రాబోయే రోజుల్లో అత్యున్నత వర్శిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యం అని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ కురుబా గోపాల్ అన్నారు. యూనివర్సిటీలో ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: ఉద్యాన వర్సిటి ప్రక్షాళనకు ఏం చర్యలు తీసుకున్నారు?

వీసీ: ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఏళ్ల తరబడి పదోన్నతుల కోసం ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. దానికి తోడు ఎవరికి కావాల్సిన పోస్టులు వారు వేయించుకుని అర్హత ఏమి లేకుండా జరిగింది. నేను పదవి చేపట్టగానే అర్హతను బట్టి ఉన్నతాధికారులను భర్తీ చేశాం. దీంతో ఏ పోస్టులో ఉండాల్సిన సామర్థ్యం వారికి ఉంది. దీంతో రాబోయే రోజుల్లో వారి ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చనేదే మా భావన.

ఆంధ్రజ్యోతి: వర్సిటి పరిధిలో కొత్త కోర్సులు ఏమైనా ప్రారంభిస్తున్నారా?

వీసీ : ఉద్యాన వర్సిటి పరిధిలో ఈజిప్ట్ కోర్సులైన జనరిక్స్, ప్లాంట్ బ్రీడింగ్, సాయిల్ సైన్స్ కోర్సులను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నాం. వాటితోపాటు ఫుడ్ ప్రాసెసింగ్, ఫాస్ట్ ఆర్వెస్ మేనేజ్‌మెంట్ కోర్సులు కూడా ప్రారంభించనున్నాం. ఈ కోర్సులకు జనవరిలో కౌన్సెలింగ్ ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: వర్సిటీలో ఫర్నిచర్ మాయమైందనే విమర్శలు వచ్చాయి?

వీసీ: కంప్ట్రోలర్ నిర్లక్ష్యం వల్ల ఫర్నిచర్ మాయమైందనేది అవాస్తవం. ఆ విధుల్లో ఉన్న ఉద్యోగి సరిగా విధులకు హాజరు కాకపోవడంతో వర్శిటి పరిపాలనా పరమైన సమస్య వచ్చింది. దీంతో ఆ ఉద్యోగిని ఆమె సొంత శాఖకు బదిలీ చేశాం. ఇక ఫర్నీచర్ విషయానికి వస్తే కొనుగోలు చేసిన ఫర్నీచర్ అంతా ఉంది. కానీ ఏ విభాగంలో ఏమేమి ఉన్నాయో అర్థం కాక మాయమైందనే విమర్శలు వచ్చాయి. వాటన్నింటి లెక్కలు తేల్చాం.

ఆంధ్రజ్యోతి: విశ్వవిద్యాలయం పనితీరు మెరుగుకు తీసుకున్న చర్యలు?

వీసీ: గతంలో లేని విధంగా ఉద్యాన వర్సిటి పరిధిలో విద్యార్థుల స్థితగతులు, ర్యాంకులు ఎప్పటికప్పుడు సమీక్షించి వారికి ఇంటర్నల్ ర్యాంకింగ్స్ ఇచ్చి ఇటు విద్యార్థుల్లో అటు అధ్యాపకుల్లో స్పిరిట్ నింపేందుకు పీఎంబీలో ఓ డైరెక్టర్‌ను నియమించాం. ఆ విభాగం ద్వారా విద్యా సంబంధిత అంశాలు మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకున్నాం. మరో రకంగా అన్ని విభాగాల హెచ్‌వోడీలతో వారి విధులు శాఖా పరమైన అంశాలపై అవగాహన కల్పించి వారిని ముందుకు నడిపే విధంగా చర్యలు తీసుకున్నాం.

ఆంధ్రజ్యోతి: కొత్త పరిశోధనలు ఏం చేపట్టారు?

వీసీ: ఉద్యాన వర్సిటి పరిధిలో కేంద్రం ద్వారా మూడు ఏసీఆర్‌బీ సెంటర్‌లు ప్రారంభించనున్నాం. దీని ముఖ్య ఉద్దేశం పొటెన్షియల్ క్రాఫ్‌ను అభివృద్ధి చేయడం. అంటే దుంపలు, ఆకు కూరలు, మెడిసిన్ ప్లాంట్స్, బీన్స్ తదితర పంటలు ఉంటాయి.

ఆంధ్రజ్యోతి: ఈ ఏసీఆర్‌బీ సెంటర్‌లు ఏ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు?

వీసీ: దర్శి (ప్రకాశం), మహానంది(నంద్యాల), పెద్దపేట(శ్రీకాకుళం) ప్రాంతాల్లో ఏర్పాటు చేశాం. వాటిలో శాస్త్రవేత్తలను కూడా నియమించాం. వారికి మేఘాలయాలో శిక్షణ కూడా అందించి పరిశోధనలు సిద్ధం చేశాం.

ఆంధ్రజ్యోతి: ఇప్పటికే ఉన్న పరిశోధనా కేంద్రాల అభివృద్ధికి తీసుకున్న చర్యలు?

వీసీ: ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలో పరిశోధనా కేంద్రాలు బాగానే పనిచేస్తున్నాయి. వాటిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల్లో పరిశోధనల ప్రగతి సమీక్షించి అభివృద్ధి పరిచేందుకు నూతనంగా డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ వ్యవస్థను అభివృద్ధి చేశాం.

ఆంధ్రజ్యోతి: రైతుల కోసం ఏర్పాటు చేసిన ఎఫ్‌ఎం ఎలా నడుస్తోంది?

వీసీ: ఇప్పటి వరకూ ఎఫ్‌ఎం రేడియో (కమ్యూనిటి రేడియో) రోజుకు రెండు గంటలు మాత్రమే రైతులకు సమాచారం అందించేందుకు ఉపయోగిస్తున్నాం. అది వర్శిటి కి 20 కిలోమీటర్ల పరిధిలో ఎఫ్‌ఎం ఫ్రీక్వెన్సీ అందుతోంది. దానికి దేశం మొత్తం సమాచారం తెలుసుకునే విధంగా నూతనంగా ఓ యాప్ ప్రారంభించేందుకు చూస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: విశ్వవిద్యాలయం దత్తత తీసుకున్న గ్రామాల పురోగతి ఏమిటి?

వీసీ: విశ్వవిద్యాలయం పరిధిలో 42 గ్రామాలను దత్తత తీసుకుని రైతులకు ఇప్పటికే అవగాహన కల్పించడం, సబ్సిడీపై మొక్కలు అందించడం చేశాం. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి యూనివర్శిటి ప్రగతి విస్తరింపజేస్తాం.

- తాడేపల్లిగూడెం రూరల్

శివ పూజకు వేళాయె..



• నేటి నుంచి కార్తీకమాస పూజలు • ఆలయాల ముస్తాబు.. ఏర్పాట్లు

భీమవరం టౌన్/పాలకొల్లు అర్బన్/పోలవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం వచ్చేసింది. శివ పూజకు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని రెండు పంచారామాలతోపాటు ప్రముఖమైన జుత్తిగలోని ఉమావాసుకీ రవి సోమేశ్వరస్వామి, నత్తారామేశ్వరంలోని రామలింగేశ్వరస్వామి, ఆచంటలోని రామేశ్వర స్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే దేవదాయధర్మాదాయ శాక జిల్లా అధికారి సుబ్బారావు పలు దేవాలయాల్లో పర్యటించి కార్తీకమాసం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంచారామాలకు బస్సులు

కార్తీకమాసంలోని నాలుగు సోమవారాలు పంచారామాల దర్శనానికి ఆర్టీసీ బస్ సర్వీసులు ఏర్పాటు చేసింది. పంచారామ దర్శిని పేరుతో బస్సులు జిల్లాలోని 4 డిపోల నుంచి నడపేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. మొదటి సోమవారం నాడు పంచారామాల్లోని స్వామి వార్లను దర్శించుకునేందుకు ఆర్టీసీ ద్వారా శుక్రవారంనాటికి 7 బస్సులు బుక్ అయ్యాయి. ఇందులో భీమవరంనుంచి 3, నరసాపురం నుంచి 1, తాడేపల్లిగూడెం నుంచి 1, తణుకు డిపో నుంచి 2 బస్సులు సిద్ధం అయ్యాయి.

రేవు ఇలా.. స్నానాలు చేసేది ఎలా..?

నరసాపురం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుల్లంక గ్రామంలోని స్నానాల రేవు అధ్వానంగా మారింది. రేవులో చెత్తా, చెదారం తొలగించలేదు. కార్తీకమాసంలో భక్తు లు ఈ రేవులోనే గోదావరిలో పుణ్యస్నా నాలు అచరించి సమీపంలోని లక్ష్మ ణేశ్వర స్వామిని దర్శించుకుంటారు. అయితే రేవు అధ్వానంగా ఉండటంతో స్నానాలు చేసేది ఎలా అంటూ భక్తులు మండిపడుతున్నారు.



పట్టిసీమలో యుద్ధప్రాతిపదికన సౌకర్యాలు

పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి క్షేత్రంలో శుక్రవారం భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రెండు రోజుల క్రితం పట్టిసీమలో వసతులేవి అనే శీర్షికన వచ్చిన వార్తా కథనానికి స్పందన లభించింది. ఆలయ అధికారులు యుద్ధ ప్రాతిపదికన సౌకర్యాల ఏర్పాటు పనులు వేగవంతంగా నిర్వహించారు. భక్తులు ఇసుక తిన్నెల్లో సౌకర్యవంతంగా రాకపోకలు సాగించేందుకు విద్యుద్దీపాలు, ఆలయ ప్రాంగణంలో రద్దీ నివారణకు క్యూలైన్లు, ఫ్యాన్లు, బారికేడ్‌లు, ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. మరమ్మతుకు గురైన మంచినీటి ఆర్వో సిస్టంను పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకువచ్చారు. కార్తీకమాసం నెలరోజులు నిత్యాన్నదానం, అల్పాహారం, ప్రసాద వితరణ కార్యక్రమాలు ఏర్పాట్లు చేశారు. 15 తేదీ శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్బంగా స్వామి వారికి లక్షపత్రి పూజ, సాయంత్రం ఆరు గంటలకు గోదావరి హారతి కార్యక్రమం అనంతరం పట్టిసీమ గ్రామంలో జ్వాలాతోరణం సేవ , 25వ తేదీ 4వ సోమవారం ఆలయ ప్రాంగణంలో స్వామివారికి లక్షదీపోత్సవం నిర్వహిస్తామని ఆలయ నిర్వహణాధికారి చాగంటి సురేష్ నాయుడు తెలిపారు.



పట్టిసీమలో ఏర్పాటు చేసిన క్యూలైన్ బారికేడ్‌లు

నది పరీవాహక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు

భీమవరం క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా భక్తులు కార్తీక పుణ్యస్నానాలు ఆచరించే ముఖ్యమైన సముద్రతీర ప్రాంతాలు, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాలు, చెరువులు, కాలువల వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. తెల్లవారు జాము స్నానాలకు వెళ్లే భక్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ వెంట పిల్లలు, వృద్ధులు, మహిళలను తీసుకుని వెళ్లినట్లయితే వారి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలు ఒంటరిగా వెళ్ళకూడదని, గోదావరి నది పరీవాహక తీర ప్రాంతాలలో తెలియని లోతుగా ఉన్న ప్రాంతాలకు వెళ్ళకూడదన్నారు. దీపాలు వెలిగించే సమయంలో మహిళలు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భక్తులు శైవ ఆలయాలకు, ఘాట్ల వద్ద స్నానాలు చేయడానికి వచ్చినప్పుడు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముఖ్యమైన ఘాట్ల వద్ద, గోదావరి నది పరీవాహక తీర ప్రాంతాలలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పంచారామ క్షేత్రాల్లో ఏర్పాట్లు



సోమేశ్వర స్వామికి అలంకరణ

గునుపూడిలోని సోమేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లను వన్‌టౌన్ సీఐ నాగరాజు పరిశీలించారు. ఆలయ ఈవో రామకృష్ణంరాజును అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్‌లు, ఉచిత ప్రసాదం, అన్న ప్రసాదాన్ని అందిస్తామని తెలి పారు. దేవస్థానం వద్ద చలువ పందిళ్ళు వేశారు. మంచినీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. ప్రతిసోమవారం ఆలయం వద్ద మెడికల్ క్యాంపును ఏర్పాటు చేస్తున్నారు. క్షీరా రామలింగేశ్వర ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటుగా భక్తులకు మూడు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం... అభిషేక దర్శనంగా ఏర్పాటు చేసి తగిన విధంగా ఏర్పాట్లు చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, వర్షం వస్తే మేట్ల ఏర్పాటు, టాయ్‌లెట్స్ వంటి ఏర్పాటు చేయడం జరిగిందని, పోలీస్, ఫైర్ సర్వీసు, వలంటీర్ల సేవలు వినియోగిస్తున్నామని ఈవో ముచ్చర్ల శ్రీనివా సరావు తెలిపారు. రేపాకవారి సత్రంలో కార్తీక మాసం అన్నిరోజులు మధ్యాహ్నం భోజనం ఉచితంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.



విద్యుత్ వెలుగుల్లో క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయం

గోదావరి జిల్లాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం

మాజీ ఎంపీ చేగొండి హరి రామ జోగయ్య లేఖ



పాలకొల్లు , నవంబరు 1 (ఆంధ్ర జ్యోతి) : కూటమి ప్రభుత్వానికి కూడా గోదావరి జిల్లాల అభివృద్ధి పట్టదా అని మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య ప్రశ్నించారు. శుక్రవారం జోగయ్య ఒక లేఖను రాశారు. దీని సారాంశం ఉభయ గోదావరి జిల్లాల అభివృద్ధి పట్ల గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం కూడా అలక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. పలు అంశాలను పరిశీలిస్తే గోదావరి పరీవాహక ప్రాంతంలో పలు విధాల అభివృద్ధి చేపట్ట వచ్చునని జోగయ్య సూచించారు. టెంపుల్ టూరిజం, పర్యాటక రంగం, నరసాపురం - కోటిపల్లి రైల్వే లైన్ పూర్తి చేయడంతో పాటు నరసాపురం నుంచి మచిలీపట్నం వరకు కొత్త రైల్వే మార్గం, అంతర్వేది డ్రెడ్జింగ్, హార్బర్, కోనసీమలో పెట్రోలియం అను సంధాన పరిశ్రమలు ఏర్పాటు చేయడం వంటి పలు సూచనలు చేశారు. వశిష్ఠ గోదావరిపై నరసాపురం - సఖినేటి పల్లి వద్ద, కోడేరు - అయోధ్యలంక వంతెనల నిర్మాణాలు, రాజమండ్రి విమానాశ్రయానికి అంతర్జాతీయ స్థాయి కల్పించాలని, అలాగే తాడేపల్లిగూడెంలో కూడా ఎయిర్ పోర్టు నిర్మాణం చేపట్టడం, గత ఎన్నికల్లో ఉభయ గోదావరి జిల్లాలను దత్తత తీసుకున్న పవన్ కల్యాణ్ ఈప్రాంత అభివృద్ధికి వెంటనే తన వంతు కృషి ప్రారంభించాలని జోగయ్య సూచించారు. అలాగే గోదావ రి జిల్లాల పరిధిలోని జాతీయ రహదారులను విస్తరించాలని, ఆర్‌అండ్‌బి రోడ్లను మెరుగు పరచాలని కోరారు.



చిన్నారులతో మంత్రి దీపావళి

దీపావళి పండుగను పాలకొల్లులోని అంజలి మానసిక వికలాంగుల కేంద్రంలోని చిన్నారులతో కలిసి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జరుపుకున్నారు. ఆయన భార్య, కుమార్తెలతో కలిసి చిన్నారులకు మిఠాయిలు పంచి బాణసంచా కాల్చారు.

- పాలకొల్లు టౌన్

లక్ష్మీ నారసింహుని సేవలో

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్





దీపం పథకం వాహనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... వేదాశీర్వచనాలు





ఎమ్మెల్యేలు, అధికారులతో సమావేశమైన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



ఐఎస్ జగన్నాథపురంలో పవన్ పర్యటన

ద్వారకాతిరుమల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఉపాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని శ్రీలక్ష్మీనారసింహ స్వామిని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ట్రస్టీ ఎస్వీ నివృతరావు, ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆయన ఆలయ యాగశాలకు వెళ్లి అక్కడ సుదర్శన నృశింహ ధన్వంతరి గరుడ ఆంజనేయ అనంత హోమాన్ని దాదాపు రెండు గంటల సేపు నిర్వహించారు. ఎరుపురంగు వస్త్రంలో ఉంచిన తన కులదేవత ప్రతిమను తెచ్చి ముందుగా ఆలయ ప్రధాన హోమగుండం వద్ద మొకరిల్లారు. అనంతరం హోమంలో పాల్గొని గణపతి పూజ, పుణవాచన, మండపారాధనను పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించి చివరగా పూర్ణాహుతి ద్రవ్యాలను హోమగుండంలో సమర్పించారు. ఆపై మంత్రజలంతో ఆలయంలోకి ప్రవేశించి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు ఆయనకు స్వామి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం పలికి స్వామి చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు.

ఆలయం వద్ద ఘన స్వాగతం

తొలుత ఆలయం వద్ద ఆయనకు మంత్రులు కందుల దుర్గేష్, కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, బొలిశెట్టి శ్రీనివాస్, చిర్రి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు, చింతమనేని ప్రభాకర్, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్‌శివ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ సువర్ణరాజు, జడ్పీటీసీ సామ్యూల్, సర్పంచ్ పి.ఏసుబాబు, డి.నరసింహమూర్తి, తదితరులు ఘన స్వాగతం పలికారు.

నూనె డబ్బా రూ.2 వేలకు కొంటున్నా..



15 లీటర్ల నూనె డబ్బా రూ.1400 లకు తెచ్చే వాడిని. ప్రస్తుతం డబ్బా రూ.2 వేలు పెట్టి కొనుగోలు చేస్తున్నా. దీంతో పాటు మిరపకాయలు, టామాటాల ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. పెరిగిన ధరల కారణంగా మావంటి చిన్న వ్యాపారస్తులు చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు, పాలకులు ధరలను నియంత్రిస్తే బాగుంటుంది.

- సత్యనారాయణరెడ్డి
బజ్జీల వ్యాపారస్తుడు, పెంటపాడు

వంట నూనెలు సలసల



మండిపోతున్న ధరలు.. వినియోగదారుల బెంబేలు

వంటనూనె ధరలు మండిపోతున్నాయి. ధరలు ఆకాశాన్ని చేరుకోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. ఒక్కసారిగా ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. నూనెపై ఆధారపడి వ్యాపారం చేసుకునే చిన్నపాటి తోపుడు బండి వ్యాపారస్తులు ఫెరిగిన నూనెధరలు చూసి ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్న పరిస్థితి నెలకొంది.

- పెంటపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి)

- క్రూడ్ ఆయిల్ దిగుమతులు తగ్గడం వల్లే పెరిగిన ధరలు పెరిగాయంటున్న వ్యాపారస్తులు
- మరోవైపు ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు

ధరల పెరుగుదలకు కారణం..

ధరలు పెరగడానికి అంతర్జాతీయ మార్కెట్ క్రూడ్ ఆయిల్ దిగుమతులు తగ్గిపోయినట్టుగా కొంతమంది హోల్‌సేల్ వ్యాపారస్తులు తెలుపుతున్నారు. విదేశాల నుంచి ఓడలలో రావాల్సిన వంటనూనె సరైనసమయానికి రాకపోవడమే ధరలు పెరగడానికి కారణమంటున్నారు. వంటనూనె ధరలపై కేంద్ర ప్రభుత్వం 20 శాతం దిగుమతి సుంకాన్ని పెంచడం కూడా పెరుగుదలకు కారణమని కొంతమంది రిటైల్ వ్యాపారస్తులు అభిప్రాయ పడుతున్నారు. ప్రస్తుతం పండుగ సీజన్ కావడంతో ఒకేసారి ధరలను అమాంతంగా పెంచేశారని సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన రెండు నెలల నుంచి నూనె ధరలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. ధరలు ఇలా పెరిగిపోతే సామాన్య ప్రజలు ఏం తిని బతకాలంటూ ప్రశ్నిస్తున్నారు.

ధరలు పెరుగుదల ఇలా

గతంలో పామాయిల్ 15 లీటర్ల డబ్బా హోల్‌సేల్‌లో రూ.1350, రిటైల్‌గా రూ.1400 ఉంటే ప్రస్తుతం హోల్‌సేల్‌లో రూ.1900 పలుకుతుంది. రిటైల్ మార్కట్‌లో రూ.2000 వరకు విక్రయిస్తున్నారు. అదే 900 గ్రాముల ప్యాకెట్ ధర గతంలో రూ.90 ఉంటే ప్రస్తుతం రూ.135 వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ఫ్రీడం అయిల్ 15 లీటర్ల డబ్బా గతంలో హోల్‌సేల్‌లో రూ.1550 ఉంటే రిటైల్‌గా రూ. 1600 నుంచి 1650 వరకు అమ్మకాలు జరిపేవారు. ప్రస్తుతం 15 లీటర్ల డబ్బా హోల్‌సేల్‌లోనే రూ.2050 పలుకుతుంది. దీన్ని రిటైల్‌గా రూ.2150 అమ్మకాలు సాగిస్తున్నారు. ఫ్రీడం ఆయిల్ 900 గ్రాముల ప్యాకెట్ ధర గతంలో రూ.120 ఉంటే ప్రస్తుతం రూ.150 పలుకుతుంది.

రైస్ రిచ్ 900 గ్రాముల ప్యాకెట్ ధర గతంలో రూ.120 ఉంటే ప్రస్తుతం రూ.150 వరకు విక్రయాలు సాగిస్తున్నారు.

గ్రామస్థాయిలో ఎవరి ధరలు వారివే

ఇక గ్రామాల్లో బయట మార్కెట్ కంటే మరో రూ.10 అదనంగానే వంటనూనె విక్రయాలు జరుగుతున్నాయి. గ్రామాల్లో చిల్లర వ్యాపారాలు సాగుతుంటాయి కాబట్టి వ్యాపారులు ఎవరికి తోచిన రీతిలో వారు ధరలు నిర్ణయించుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. పెరిగిన ధరలను చూసి నోరెళ్ళ బెట్టడం తప్ప వినియోగదారులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది

కూరల ధరల భయం

- ఇప్పటికే కొండెక్కిన ధరలు.. నేటి నుంచి కార్తీకమాసం ఎఫెక్ట్

నరసాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో కూరల ధరలకు రెక్కలొస్తాయి. నెల రోజుల పాటు చాలామంది నాన్‌వెజ్‌కు దూరంగా ఉంటారు. కూరగాయలనే ఎక్కువగా వినియోగిస్తారు. స్వామిమాలలు వేసుకున్న భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా ప్రతి ఏటా ఈనెలలో కూరగాయల ధరలు పెరుగుతుంటాయి. ఈసారి వర్షాల కారణంగా ముందుగానే ధరలు కొండెక్కాయి. శనివారం నుంచి మొదలయ్యే కార్తీకమాసంలో వీటి ధరలు మరింత పెరుగుతాయన్న భయం సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో నెలకొంది. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో కాయగూర సాగుకు ప్రసిద్ధి, బీర, పొట్ల, బెండ, వంగ, దోస, దొండ, సొరకాయలతో పాటు ఆకు కూరలు ఎక్కువగా పండుతాయి, క్యారెట్, టమాట, బీట్‌రూట్, పచ్చి వంటి రకాల ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి అవుతాయి. ఎక్కడికక్కడ పాట మార్కెట్‌లు ఉన్నాయి. రైతులు పండించిన పంటను మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ఈసారి ధరలు ముందుగానే చుక్కలంటాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వర్షాకాలంలో వానలు, వరదలొచ్చాయి. ఈ కారణంగా పంటలన్నీ దెబ్బతిన్నాయి. ప్రస్తుతం అన్ని ఇతర జిల్లాల నుంచి దిగుమతి అవుతున్నాయి. అన్నీ కేజీ రూ.50పైనే పలుకుతున్నాయి. కార్తీకమాసం సీజన్‌లో డిమాండ్‌ను బట్టి ధరలు మరింత పెరుగుతాయన్న వాదనలు మార్కెట్‌లో వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఆకు కూరల కట్ట రూ.30 పలుకుతుంది. కొత్తిమీర రూ.50లేనేది రావడం లేదు. ఉల్లి కేజీ రూ.50 దాటాయి. నరసాపురంలో రైతు బజార్ వ్యాపారి అద్దాల శ్రీను మాట్లాడుతూ సాధారంగా కార్తీకమాసంలో కూరగాయలకు మంచి డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం అమ్ముతున్న దాని కంటే ఈనెలలో ఎక్కువగా అమ్ముతాం డిమాండ్‌కు అనుగుణంగా సరుకులు తీసుకొస్తామంటున్నారు.



పైడిచింతపాడులో ఉద్రిక్తం

పింఛన్ల పంపిణీ సందర్భంగా పరస్పర దాడులు

టీడీపీ, జనసేన నాయకుల మధ్య వర్గవిభేదాలు



పైడిచింతపాడులో టీడీపీ - జనసేన నాయకుల ఘర్షణ

ఏలూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలం పైడి చింతపాడులో టీడీపీ, జనసేన నాయకుల మధ్య వర్గవిభేదాలు తారస్థాయికి చేరాయి. పైడిచింతపాడులో గురువారం ఉదయం సామాజిక పింఛన్ పంపిణీలో జనసేన, టీడీపీ వర్గీయుల మధ్య వివాదం రేగింది. ఇదికాస్త చినికి చినికి గాలివానలా మారి కొట్లాటకు దారితీసింది. కొట్లాటలో ఇరువర్గాల నాయకులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను అదుపు చేశారు.

గ్రామంలో గురువారం ఉదయం టీడీపీ నాయకులు దగ్గరుండి పింఛన్‌లు అందించేందుకు పూనుకున్నారు. ఈ విషయం ఇటీవల వైసీపీ నుంచి జనసేన పార్టీలోకి వచ్చిన నాయకులు తమకు సమాచారం అందించకుండా పింఛన్లు ఏ విధంగా పంపిణీ చేస్తారంటూ టీడీపీ నాయకులను ప్రశ్నించారు. మీకు చెప్పాల్సిన పని లేదంటూ టీడీపీ నాయకులు ప్రశ్నించడంతో జనసేన, టీడీపీ వర్గీయుల మధ్య తోపులాటకు దారితీసింది. వైసీపీ నుంచి జనసేనలోకి వచ్చిన నాటి నుంచి గతనెల కూడా పింఛన్ పంపిణీ విషయంలో ఆధిపత్య పోరు నడిచింది. అక్టోబరు ఒకటో తేదీన సైతం ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. తిరిగి అదే విషయంపై పునరావృతమైంది. ఇరువర్గాల నాయకులు సచివాలయం బయటకు వచ్చి కొట్లాడుకున్నారు. గ్రామంలో టీడీపీ నేతల ఆగడాలు పెరిగిపోయాయంటూ జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రౌడీమూకలతో జనసేనలో చేరి పెత్తనం చెలాయిస్తే ఊరుకోమని టీడీపీ నాయకులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం గ్రామంలో పోలీస్‌పికెట్ ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం ఏలూరు ఎంపీడీవో శ్రీలత అక్కడకు చేరుకుని సచివాలయ సిబ్బంది చేత పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ -జనసేన మధ్య పరస్పర దాడులు ఇరువర్గాల నేతల మధ్య పొత్తుధర్మం లేకపోవడంపై ఆయా పార్టీ నాయకులు అధినేతలకు ఫిర్యాదు చేసేందుకు సమాయత్తం అయ్యారు.

11 మందిపై కేసు..

ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సైదు నాగరాజు ఫిర్యాదు మేరకు జనసేన నాయకులైన ముంగర వెంకటేశ్వరరావు, మురార్జీ, రాంపండు, రంగబాబు తదితరులు మొత్తం పదకొండు మందిపై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు. ఏలూరు ప్రభుత్వఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సైదు నాగరాజును దెందులూరు ఎమెమల్యే చింతమనేని ప్రభాకర్ పరామర్శించారు.

చిన వెంకన్నకు దేవదాయ కమిషనర్ పూజలు



శ్రీవారి చిత్రపటాన్ని అందుకుంటున్న కమిషనర్ సత్యనారాయణ

ద్వారకాతిరుమల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) :ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ శుక్రవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అధికారులు, అర్చకులు దేవస్థానం మర్యాదలతో పూర్ణకుంభ ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో అర్చకుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం బంగారువాకిలి మీదుగా లోనికి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు జరుపుకున్నారు. అర్చకులు స్వామి వారి శేషవస్త్రాన్ని ఇచ్చి వేదాశీర్వచనం అందించారు. ఈవో ఎన్వీఎస్ఎన్‌మూర్తి ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు.

లోకాయుక్తకు ఎంపీహెచ్‌ఏ-మేల్ ఉద్యోగుల వివరాలు

ఏలూరు అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో డీఎస్సీ-2002 నోటిఫికేషన్ ద్వారా కాంట్రాక్టు ప్రాతిపదికన నియమితులైన వారిలో కొందరు మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు (ఎంపీహెచ్‌ఏ-మేల్) నకిలీ సర్టిఫికెట్లతో క్రమబద్ధీకరణలో లబ్ధిపొందారనే ఫిర్యాదుమేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పనిచేస్తున్న ఎంపీహెచ్‌ఏ-మేల్ ఉద్యోగుల అన్ని సర్టిఫికెట్లు, ఇతర ధ్రువపత్రాలు, రిక్రూట్‌మెంట్ ప్రక్రియకు సంబంధించిన డాక్యుమెంట్ల కలర్ జిరాక్స్ కాపీల సెట్లను లోకాయుక్త ఆదేశాలపై జిల్లా అధికారులు పంపించారు. అనంతపురం జిల్లాలో ఒకరు లోకాయుక్తను ఆశ్రయించడంతో రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల నుంచి ఈ సమాచారాన్ని కోరారని స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయవర్గాలు తెలిపాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రిక్రూట్‌మెంట్‌లో ఉమ్మడి జిల్లాలో సుమారు 205 మంది ఎంపీహెచ్‌ఏ-మేల్ ఉద్యోగులుగా నియమితులైనట్టు తెలిసింది. లోకాయుక్త ఉమ్మడి జిల్లా నుంచి సమాచారం కోరిన విషయాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ ధ్రువీకరించారు. లోకాయుక్త ఆదేశాల మేరకు సమాచారాన్ని పంపామని, ఇతర వివరాలు చెప్పలేనన్నారు.

మున్సిపల్ టీచర్ల పదోన్నతులపై కసరత్తు

ఏలూరు అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని ఏలూరు కార్పొరేషన్, మరో ఏడు పురపాలక సంఘాల పాఠశాలల టీచర్లకు పదోన్నతులు ఇచ్చేందుకు కసరత్తును వేగవంతం చేశారు. ఆయా మున్సిపాల్టీల వారీగా టీచర్ల సీనియార్టీ జాబితాలను ఇప్పటికే జిల్లా వెబ్ సైట్‌లో పొందుపర్చి, వాటిపై అభ్యంతరాల ను కోరారు. శుక్రవారం గడువు ముగిసే సరికి తొమ్మిది అభ్యంతరాలు అందాయి. వీటిని పరిష్కరించిన అనంతరం ఈనెల 4న తుది సీనియార్టీ జాబితాలను విడుదల చేసి, ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మేరకు నిర్ధారిం చిన పోస్టులను పదోన్నతి ద్వారా ఆరో తేదీన భర్తీ చేయాలని భావిస్తున్నారు. కొత్త డీఈవోగా నియమితులైన వెంకటలక్ష్మమ్మ శుక్రవారం జిల్లాలో బాధ్యతలు చేపట్టక పోవడంతో కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో కేడర్, సబ్జెక్టుల వారీగా వేకెన్సీల వివరాలు, సంఖ్యలను తుదిగా నిర్ధారించ డానికి ఒకింత జాప్యం జరుగుతోంది.

క్రైమ్ కార్నర్

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో గురు, శుక్రవారాల్లో మొత్తం ఎనిమిది మంది మృతి చెందారు. ఏలూరు నగరంలో ఉల్లిపాయ బాంబులు పేలడంతో ఒకరు మృతి చెందారు. పెదవేగి మండలం వంగూరులో రైతు ఆత్మహత్యకు పాల్పడగా, తణుకులో ఒకరు హత్యకు గురయ్యారు. మరో యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పాలకోడేరు మండలంలో ఒకరు.. తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో మరొకరు.. పెనుమంట్ర మండలంలో లారీ డ్రైవర్, ఏలూరులో వృద్ధురాలు అనుమానాస్పదంగా మృతి చెందారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



శివన్నారాయణ (ఫైల్)

పెదవేగి,నవంబరు 1 (ఆంధ్ర జ్యోతి) : దీపావళి పండుగ రోజున ఆ ఇంటిలో విషాదం నెలకొంది. సాగు నష్టాలను అధిగ మించలేక ఆ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఐదురోజులపాటు మృత్యువుతో పోరాడి చివరకు అసువులు బాసాడు. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ, స్థానికులు తెలిపిన వివరా లివి.. వంగూరుకు చెందిన మేకా శివన్నారాయణ (32) రెండున్నర ఎకరాలలో మిర్చి, వరి సాగు చేశాడు. వరుసగా నష్టాలు రావడంతో అప్పులపా లయ్యాడు. మనస్తాపానికి గురైన గత నెల 27న పురుగుల మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని తొలుత ఏలూరు ప్రభుత్వాస్పత్రికి, అనంతరం విజయవాడలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఆయనకు భార్య సుధారాణి, ఇద్దరు కుమార్తెలు, రెండేళ్ళ కుమారుడు ఉన్నారు.

తణుకులో ఒకరి హత్య

తణుకు : తణుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం అర్ధరాత్రి ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. తణుకు సజ్జాపురానికి చెందిన కాకర్ల దుర్గారా వు(35)గా పోలీసులు గుర్తించారు. స్కూ లు ప్రాంగణంలో గురువారం బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. రాత్రి నిర్దేశిత సమయంలో పోలీసులు షాపులు మూయించి వేసిన తర్వాత కారణం తెలియదు కాని ఇరువురి మధ్య ఘర్ష ణలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. శుక్రవారం ఉదయం కొంతమంది వాకర్సు వాకింగ్‌కు వచ్చిన పుడు చనిపోయిన వ్యక్తిని గమనించి పోలీసులు సమాచారం అందించారు. డీఎస్పీ విశ్వనాథ్, సీఐ కొండయ్య, పోలీసులతో పాటు క్లూస్ టీము, డాగ్ స్కాడ్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అతడి భార్య అలివేలు మంగతో పదేళ్ల నుంచి వేర్వేరుగా ఉంటున్నారు.మృతదేహంపై గాయాలు ఉన్నందున హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ పోలీసులు తెలిపారు.

భార్య,కుమార్తెలపై ఆధారపడి బతకలేక ఒకరు..

పాలకోడేరు : జీవితంపై విరక్తితో భార్య, కుమార్తెలపై ఆధారపడి బతకలేక పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఆత్మహత్యకు పాల్పడిన సికిలే గిద్యోని (56)మృతి చెందిన ఘటన శుక్రవారం గరగపర్రులో జరిగింది. పాలకోడేరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సికిలే గిద్యోని కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. భార్య కేథరిన్, కుమార్తె శారమ్మలపై ఆధారపడి జీవించలేక శుక్రవారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయన్ని భీమవరంలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు పాలకోడేరు పోలీసులు తెలిపారు.

ఏలూరులో ఉల్లి బాంబుల పేలుడు

ఒక యువకుడి మృతి
8 మందికి తీవ్ర గాయాలు



ఘటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కిషోర్

ఏలూరు టూటౌన్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ రోజున గురువారం మధ్యాహ్నం 12.15 గంటలకు ఏలూరు వన్‌టౌన్‌లో ఆకస్మాత్తుగా పేలుడు సంభవించడంతో నగర ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఇద్దరు యువకులు ఉల్లిపాయ బాంబులను గోనెసంచిలో సర్దుకుని స్కూటర్‌పై వెళ్తుండగా పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా ఒక యువకుడితో పాటు మరో ఏడుగురు గాయాలపాలయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. ఏలూరు సత్యనారాయణ పేటకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ తాబేలు సాయిరామ్ అతడి స్నేహితుడు ఏలూరు మారుతీనగర్‌కు చెందిన పూల కొట్టులో పని చేసే దుర్గాసి సుధాకర్(28) కలిసి ఏలూరు మాదేపల్లి రోడ్డులోని కబేళప్రాంత సమీపం నుంచి ఉల్లిపాయ బాంబులను గోనెసంచిలో వేసుకుని స్కూటర్‌పై సత్యనారాయణపేట వెళ్తున్నారు. మార్గమధ్యలో తూర్పువీధి గౌరమ్మ గుడి వద్ద ఆకస్మాత్తుగా ఉల్లిపాయబాంబులు పేలడంతో పెద్ద విస్ఫోటం సంభవించింది. సుధాకర్ రెండు ముక్కలైపోయాడు. అతడి ఎడమకాలు రెండుమీటర్ల దూరంలోని మూడంతస్తుల భవనంపై పడగా కుడికాలు పక్కనే ఉన్న భవనంపై పడింది. గౌరమ్మ గుడి ఎదురుగా నిలబడి మాట్లాడుకుంటున్న ఏడుగురు యువకులైన అదే ప్రాంతానికి చెందిన కె.శ్రీనివాసరావు, ఎస్‌కే.ఖాదర్, మళ్ళా పెద్దిరాజు, సువ్వారి శశి, మెడికల్ షాపు సురేష్, బొడ్డేటి సతీష్‌కుమార్, సువ్వారి సత్యనారాయణ తీవ్రగాయాలకు గురయ్యారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, ఎస్‌కే.మదీనబాషా వారి వద్దకు చేరుకుని క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రభుత్వాసుపత్రిలో ఆర్తనాదాలు

క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడంతో కాలిన గాయాలతో ఉన్నవారు పెట్టిన కేకలు వర్ణనాతీతం. వారి కేకలు విన్న బంధువులు తల్లడిల్లిపోయారు. వారి రోదనలతో ఆసుపత్రి వద్ద ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రసాదరెడ్డి, డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు, డాక్టర్ మల్లికార్జున రాజు, డాక్టర్ కుమార్ పలువురు వైద్యులు వెంటనే ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులకు వైద్యసేవలందించారు. తాబేలు సాయిరామ్ పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో అతడిని విజయవాడ తరలించారు. సురేష్, సతీష్‌కుమార్, సత్యనారాయణలను ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ఘటన స్థలంలో ఎస్పీ పరిశీలన

ఉల్లిపాయ బాంబుల పేలిన ప్రమాద సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ కేపీఎస్.కిషోర్, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, జిల్లా క్లూస్ టీమ్ బృందాలు, విజయవాడ పోరెన్సిక్ బృందాలు పరిశీలించారు. సంఘటన స్థలంలో పలు ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ ఉల్లిపాయ బాంబులు ఎక్కడ నుంచి తీసుకువచ్చారన్న దానిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. క్షతగాత్రులను ఎస్పీ కిషోర్ పరామర్శించారు.

రైలు కిందపడి యువకుడు..

తణుకు : తణుకు పట్టణానికి చెందిన యువకుడు శుక్రవారం తెల్లవారుజామున రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక గౌతమి సాల్వెంట్ పరిశ్ర మ సమీంలోని రైలు కింద పడినట్లు చెబుతు న్నారు. తణుకు పాతూరుకు చెందిన సిద్దు(22)గా గుర్తించారు. తణుకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని మరొకరు..

తాడేపల్లిగూడెం రూరల్ : రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆరుగొలనులో శుక్రవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివి.. ఆరుగొలనుకు చెందిన బి.శ్రీను(48) కూలిపని చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. శుక్రవారం బహిర్భూమికి రైల్వే ట్రాక్‌పైకి వెళ్లి రైలు వస్తున్నట్టు గమనించకుండా పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు.

లారీ డ్రైవర్ అనుమానాస్పద మృతి



రవికుమార్ (ఫైల్)

పెనుమంట్ర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మార్టేరు గ్రామంలో నివాసం ఉంటున్న లారీ డ్రైవర్ పులిదిండి రవికుమార్ (41) అనుమానాస్పదంగా మృతి చెందినట్టు పెనుమంట్ర ఎస్ఐ స్వామి తెలిపారు. వివరాలిలా.. మూడేళ్లుగా లారీ డ్రైవర్ రవికుమార్ మార్టేరులో నివాసముం టున్నారని గురువారం రాత్రి అతడు ఉంటున్న అద్దె ఇంటిలో చనిపోయిన విషయం పక్కింటి వారు చూసి పోలీసులకు సమాచారం అందిం చారు. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మద్యానికి బానిస అయ్యారని స్థానికులు వెల్లడిం చారు. అతడు మరణించాడని బంధువులకు సమాచారం అందించి, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలి మృతిపై కేసు నమోదు

ఏలూరుక్రైం :ఓ వృద్ధురాలు గుండెపోటుతో మరణించగా ఆ వృద్ధురాలికి అప్పు ఇచ్చిన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఏలూరు గణేశ్‌నగర్ కాలనీకి చెందిన పి.రమణమ్మ(64) ఇంటిలో ఒంటరిగా జీవిస్తుండగా అ పక్కనే మనుమరాలు పావని జీవిస్తుంది. రమణమ్మ గురువారం రాత్రి గుండెపోటుతో మరణించింది. రమణమ్మకు డబ్బులు అప్పిచ్చిన కొండపల్లి దుర్గ 112 నంబరుకు కాల్ చేసి రమణమ్మను ఆమె మనుమరాలు పావని కొట్టడంతో మరణించిందంటూ సమాచారమిచ్చింది. ఏలూరు రూరల్ ఎస్ఐ సీహెచ్.దుర్గాప్రసాద్ శుక్రవారం ఉదయం సిబ్బందితో వెళ్ళి పరిశీలించి, అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం జరిపించారు. ఆమె గుండెపోటు వల్ల మరణించిందని వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఉంగుటూరు : వెనుక నుంచి మోటారు సైక్లిస్టును ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలన ఘటన జాతీయ రహదారిపై నారాయణపురం వద్ద జరిగింది. చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాలివి.. పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన మల్లపురెడ్డి కనకదుర్గారావు భీమడోలు మండలం పూళ్ళలోని అత్తారింటికి వెళ్ళి బియ్యం మూటతో బైక్‌పై తిరిగి తన స్వగ్రామం వస్తుండగా గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయమైంది. గాయప డిన వ్యక్తిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసును చేబ్రోలు పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

మార్చురీలో మృతదేహం మాయంపై కేసు

ఏలూరుక్రైం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో మృతదేహం మాయమైన ఘటనపై ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్ ఫిర్యాదు మేరకు ఏలూరుటూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అయిన మార్చురీ అసిస్టెంట్ అశోక్ గతనెల 8వ తేదీ రాత్రి డ్యూటీలో ఉన్న మరో మహిళా మార్చురీ అసిస్టెంట్ వద్ద నుంచి మార్చురీ తాళాలు తీసుకుని ఓ మృతదేహాన్ని అంబులెన్స్‌లో వేసుకుని తీసుకెళ్ళాడు. ఈ విషయాన్ని గమనించిన ఆ మహిళా ఉద్యోగి గొడవ చేయడంతో కొంత సమయం తరువాత మళ్లీ తీసుకువచ్చి పెట్టేశాడు. ఈ ఘటనపై ఇప్పటికే ఆ మహిళా ఉద్యోగి పోరెన్సిక్ విభాగం ఇన్‌ఛార్జ్ అయిన డాక్టర్ భాస్కరరావుకు ఫిర్యాదు చేశారు. ఆయన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయగా ఈ ఘటనపై విచారణ చేశారు. ఇక్కడ నుంచి అనేక అనాథ మృతదేహాలు ఇతర రాష్ట్రాల్లోని మెడికల్ కాలేజీలకు విక్రయించారని ప్రాథమికంగా నిర్ధారణ చేశారు. డాక్టర్ సుధాకర్ ఫిర్యాదు మేరకు అశోక్‌పై సీఐ వైవీ.రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నా అంత్యక్రియలు పుట్టింటి పేరుతోనే..

- సూసైడ్ నోట్ రాసి ఉరి వేసుకున్న వివాహిత



ప్రత్యూష(ఫైల్)

రాజమహేంద్రవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పెళ్లయిన 70 రోజులకే బలవంతంగా ఓ వివాహిత ప్రాణాలు తీసుకోవడంతో.. దీపావళి రోజున ఆ ఇంట్లో చీకట్లు అలుముకున్న ఘటన రాజమహేంద్రవరంలో జరిగింది. కంబాల చెరువు సమీపంలోని లోలుగు అపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్టరుగా జీవనం సాగిస్తూ అమలకంటి వెంకట ప్రసాద్ కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె ప్రత్యూష(26)కు ఈ ఏడాది ఆగస్టు 22న పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన కత్తి నాగసత్యశ్రీనివాసరావు కుమారుడు వంశీ రాధాకృష్ణకు ఇచ్చి వివాహం చేశారు. చెన్నైలోని చెన్నై పెట్రో కెమికల్స్ లిమిటెడ్ కంపెనీలో రాధాకృష్ణ చార్టర్డ్ ఎక్కౌంటెంట్‌గా పని చేస్తున్నారు. పెళ్లయిన రెండు రోజులు ఇద్దరూ పాలకొల్లులో ఉన్నారు. తర్వాత అతడు చెన్నై వెళ్లిపోగా అబ్బాయి తల్లిదండ్రులు, ప్రత్యూష తల్లిండ్రులు ఈమెను తీసుకెళ్లి చెన్నైలో దిగబెట్టారు. వారం తర్వాత ప్రత్యూషను రాధాకృష్ణ తీసుకొచ్చి తమ ఇంటి వద్ద దించేసి వెళ్లిపోయాడని ఫిర్యాదులో ప్రసాద్ పేర్కొన్నారు. తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫలితం లేకపోయిందన్నారు. దీంతో తమ కూతురిని విచారించగా తన బాధలు చెప్పుకుంటూ కన్నీటి పర్యంతమైందన్నారు. 'హోమియోపతి మెడిసిన్ డిస్‌కంటిన్యూ చేసిన నన్ను ఉద్యోగం చేయాలని బలవంతం చేస్తున్నారు. ఉద్యోగం చేస్తావనే నిన్ను చేసుకున్నాం. రూ.3 కోట్లు కట్నం ఇస్తానన్న సంబంధాలు వదులుకున్నాం. పెళ్లి సమయంలో మీ వాళ్లు ఇస్తానన్న స్థలం అమ్మేసి డబ్బులు తీసుకురా. చెన్నైలో ఫ్లాట్ కొంటాం' అని మానసికంగా వేధిస్తున్నారని చెప్పిందన్నారు. పెళ్లి సమయంలో రూ.5లక్షల కట్నం ఇవ్వడంతోపాటు 15 కాసుల బంగారం పెట్టా మన్నారు. వినాయక చవితి, దసరాకు రమ్మ న్నా ఏదోక సాకు చెప్పే వాడని తెలిపారు. తమ అమ్మాయి భర్తకు ఫోన్ చేస్తే మాట్లాడేవాడు కాదన్నారు. పెళ్లయిన రెండు నెలలకే తన సంసారం ఇలా కావడంతో మానసికంగా కుంగిపోయిందన్నారు. తనకు గుండెపోటు రావడంతో చికిత్స జరిగిందని అప్పటి నుంచీ ఇంటి దగ్గరే ఉండడంతో తాము నచ్చజెబుతూ వచ్చామన్నారు. దీపావళి ముందు రోజున బుధవారం రాత్రి తీవ్రంగా ఏడ్చిందన్నారు. 11గంటల సమయంలో తన గదిలోకి వెళ్లిపోయిందని చెప్పారు. దీపావళి రోజున ఉదయం తన భార్య నాగమణి గది తుడవడం కోసం వెళ్లి చూడగా చున్నీతో ఫ్యానుకు ఉరి వేసుకున్న స్థితిలో ప్రత్యూష ఉందన్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. తన కూతురు మరణానికి భర్త రాధాకృష్ణ, మామ నాగ సత్య శ్రీనివాస్, అత్త పద్మప్రియ వేధింపులే కారణమని ఫిర్యాదులో తండ్రి పేర్కొన్నారు.

- **పుట్టింటి పేరుతోనే..**

ప్రత్యూష రాసినట్టు భావిస్తున్న మరణ వాంగ్మూలం లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దానిలో తన అంత్యక్రియలు అత్తవారింటి పేరుతో చేయవద్దని, పుట్టింటి పేరుతోనే చేయాలని పేర్కొనడం చూస్తే ఎంత వేదనకు గురైందోనని స్థానికులు కన్నీరు పెట్టుకున్నారు. కేసును సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేశ్ బాబు దర్యాప్తు చేస్తున్నారు. భర్త రాధాకృష్ణ, మామ నాగ సత్య శ్రీనివాస్, అత్త పద్మప్రియలను అరెస్టు చేశారు. శనివారం కోర్టులో హాజరు పరచనున్నారు.

7 నుంచి పవిత్రోత్సవాలు

భీమవరం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జేపీ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో జరగనున్న స్వామివారి పవిత్రోత్సవాల బ్రోచర్‌ను ఎమ్మెల్యే అంజిబాబు ఆవిష్కరించారు. ఆలయ చైర్మన్ మంతెన రామ్ కుమార్ రాజు, ఆలయ ఈవో ముదునూరి సత్య నారాయణ రాజు మాట్లాడుతూ 7వ తేదీ ఉదయం 9 గంటలకు హోమం, దీక్షాధారణ, 8న సప్తకలశారాధన, స్నపన, 9న పూర్ణాహుతి జరుగుతాయని భక్తులంతా పాల్గొనాలన్నారు.



టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న కొత్తపల్లి నాగరాజు

పాలకోడేరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు చేతుల మీదుగా పాలకోడేరు గ్రామానికి చెందిన సొసైటీ బ్యాంకు మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి నాగరాజు రూ.లక్ష కట్టి టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు విజన్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే ఆయన అడుగు జాడల్లోనే ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు తనదైన శైలిలో నాలుగు మండలాలను అభివృద్ధి చేస్తూ ముందుకెళ్తున్నారని, ఇటువంటి నాయకులతో టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.



సీఎంను కలసిన గొట్టుముక్కల

ఆకివీడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబునాయుడును మంగళగిరి సెక్రటేరియట్‌లో టీడీపీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ మాజీ కన్వీనర్ గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. పలు సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి ఆకివీడులో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి రోజుకు సుమారు 400 మందికి భోజనాలు అందచేస్తున్నారని, టీడీపీ ఆవిర్భావం నుంచి సత్యనారాయణరాజు తండ్రి సుబ్బరాజు, తరువాత సత్యనారాయణరాజు పార్టీకి ఎనలేని సేవలందిస్తున్నారంటుండడంతో చంద్రబాబు తనకు తెలుసన్నారు. పార్టీకి కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈయన వెంట హైదరాబాద్ వైద్యులు గొట్టుముక్కల వెంకట సూర్యనారాయణరాజు, కలిదిండి రఘురామరాజు తదితరులు ఉన్నారు.

8 నుంచి సీపీఎం ప్రజాపోరు

భీమవరం అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై సీపీఎం ఈ నెల 8 నుంచి 15 వరకు ప్రజాపోరు, ఇంటింటికి సీపీఎం అనే కార్యక్రమానికి పార్టీ పిలుపునిచ్చిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 14న అన్ని మండల కార్యాలయాల వద్ద ఆందోళనలు, 15న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేస్తున్నట్లు వివరించారు. జిల్లా కార్యదర్శి బి. బలరాం మాట్లాడుతూ ధర్నాలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని బలరాం పిలుపునిచ్చారు.



సర్పంచ్ సొంత నిధులతో రోడ్డు పనులు

కాళ్ళ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాళ్ళ మండలం దొడ్డనపూడి గ్రామానికి వెళ్ళే ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి గోతులమయం కావడంతో సర్పంచ్ కొల్లి సుబ్బారావు సుమారు 3.50 లక్షలు స్వంత నిధులతో రోడ్డు పనులు ప్రారంభించారు. పనులను శుక్రవారం మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్నప్రసాద్ (తాతపండు), వార్డు సభ్యులు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రోడ్డు పరిస్థితిపై ఆర్‌అండ్‌బీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని దీంతో సర్పంచ్ సుబ్బారావు ముందుకు వచ్చి స్వంత నిధులతో మరమ్మతులు పనులకు శ్రీకారం చుట్టారన్నారు. రహదారి ప్రక్కన ఉన్న పొదలను తొలగించడంతో పాటు వెట్ మిక్స కాంక్రీటు రాళ్ళు రహదారిపై ఏర్పడ్డ గోతులను పూడ్చివేత పనులు చేపట్టారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం చేయాలని పలువురు గ్రామ ప్రజలు కోరారు.

భీమవరం విద్యార్థులకు అంతర్జాతీయ చెస్ రేటింగ్

భీమవరం అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ చెస్ సమాఖ్య శుక్రవారం విడుదల చేసిన ఇంటర్నేషనల్ రేటింగ్ లిస్టులో భీమవరం పట్టణానికి చెందిన అముదాల పల్లిశరణ్, జాసిత్ వర్మ, కార్తీక్ రేటింగ్ సాధించారని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. 8వ తరగతి చదువుతున్న అముదాలపల్లి శరణ్ క్లాసికల్ విభాగంలో 1467 రేటింగ్ పాయింట్లను, 4వ తరగతి విద్యార్థి జాసిత్ వర్మ 1551, శివ కార్తిక్ బ్లిట్జ్ విభాగంలో 1479 రేటింగ్ పాయింట్లు సాధించారన్నారు. వీరు అనుసూయ చెస్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నారన్నారు.






భీమవరంలో ఉచిత గ్యాస్ సిలిండర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు.. ఉండిలో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు..తాడేపల్లిగూడెంలో అందజేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి.. నరసాపురంలో అందజేస్తున్న ఎమ్మెల్యే నాయకర్

ఉచిత గ్యాస్ సంబరాలు




భీమలాపురంలో ఉచిత గ్యాస్ అందిస్తున్న ఎమ్మెల్యే పితాని... సరిపల్లిలో అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు



తణుకులో స్టవ్ వెలిగిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

భీమవరం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళల కళ్లలో ఆనందం చూసేందుకు ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లను కూటమి ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. భీమవరంలోని బీవీ రాజు విగ్రహం సెంటర్‌లోని దశిక గ్యాస్ ఏజెన్సీ వద్ద ఉచిత గ్యాస్ పథకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. భీమవరం నియోజకవర్గంలో 81,348 మంది తెల్లకార్డుదారులున్నారని, వారికి ఈ ఉచిత సిలిండర్ ద్వారా ఏడాదికి రూ. 15 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. వేలాది కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, భీమవరం నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఆర్డీవో ప్రవీణ్ మాట్లాడుతూ ఉచిత సిలిండర్ పథకంలో ఏమైనా సమాచారం కోసం 1967 నంబరుకు సంప్రదించాలన్నారు. తహసీల్దార్ రవి రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భీమవరం అర్బన్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతా రామలక్ష్మీ అన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ కార్యక్రమాన్ని పట్టణంలోని 14వ వార్డులో శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుకూలించకపోయినా హామీలను సీఎం ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తున్నారన్నారు. ముందుగా రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉండి: నియోజకవర్గంలో దీపం పథకం కింద రూ. 17 కోట్లు వ్యయంను ప్రభుత్వం వెచ్చిస్తోందని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అన్నారు. ఉండి లోని ఇండేన్ గ్యాస్ కంపెనీ వద్ద ఉచిత గ్యాస్ పథకాన్ని కంపెనీ అధినేత స్వర్ణలత ఆధ్వ ర్యంలో ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ నియోజకవర్గంలో 66, 665 కుటుం బాలకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కాగా ఉండిలో రెండో మంచి నీటి చెరువును ఎమ్మెల్యే పరిశీలించారు.

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలో మహిళలకు ఉచిత గ్యాస్‌ను వలవల బాబ్జి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీతో కలసి పంపిణీ చేసి మాట్లాడుతూ ఎన్నికలు ముగిసి 5 నెలలు కావస్తున్నా కనీసం బయటకు రాలేని మాజీ మంత్రి కొట్టుకు తమను విమర్శించే స్థాయి లేదన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ దోచుకోవడమే ధ్యేయంగా వైసీపీ పాలన సాగించిందన్నారు. ఆర్డీవో ఖతీబ్, గొర్రెల శ్రీధర్, నరిసే సోమేశ్వరరావు, పాతూరి రాంప్రసాద్‌చౌదరి, అమృతం, పాలూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తణుకు: హామీలను అమలు చేస్తామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఉచిత గ్యాస్ సిలండర్ల పథకాన్ని ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలో 88 వేల తెల్లకార్డులుంటే ఈ పథకం ద్వారా 68వేల705 మంది లబ్ది పొందారన్నారు. మిగిలిన వారు బ్యాంకు బుక్, కెవైసి, ఆధార్ లింక్, ఫోన్ లింకు చేసుకోవాలని చెప్పారు. అనంతరం హౌసింగ్ బోర్డులోని లబ్దిదారుని ఇంటికి స్వయంగా వెళ్ళి టీ పెట్టి లబ్దిదారకు, అధికారులకు అందజేసారు.

నరసాపురం టౌన్: కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఉచిత గ్యాస్ పథకాన్ని మాజీ మంత్రి కొత్తపల్లి, టీడీపీ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్‌తో కలసి ఆయన ప్రారంభించారు.

గణపవరం: ఉచిత గ్యాస్ పంపిణీ పథకాన్ని ప్రారంభించడం రాష్ట్ర ప్రగతికి నిదర్శనమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం సరిపల్లెలో ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ఆవరణలో జరిగిన ప్రారంభోత్సవ సభలో ఆయన ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలసి లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. సర్పంచ్ చనుమూరి లక్ష్మీభవాని, టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆచంట: అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, మాజీ మంత్రి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన ఉచిత గ్యాస్ పథకాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు సిలిండర్లను అందజేశారు. మండలంలోని భీమలాపురం, ఆచంటలో జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ఆచంట నియోజకవర్గంలో 71 వేల 295 మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మహనీయుల ఆశయాలు ఆదర్శం

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలను ఏకం చేసిన మహోన్నతుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని వీసీ డాక్టర్ బి. గోపాల్ పేర్కొన్నారు. దేశ ప్రథమ హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఆవరణలో ఏక్తా దివస్ నిర్వహించారు. పటేల్ జీవితంపై పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు ఇచ్చారు. రిజిస్ట్రార్ బి. శ్రీనివాసులు, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్స్ ఎస్. సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: మహనీయుల ఆశయాలను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్ అన్నారు. ఏపి నిట్ లో ఏక్తా దివాస్ ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ కిరణ్ తీపర్తి, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉద్యాన వర్సిటీలో..

భీమవరం టౌన్: పటేల్ జయంతిని శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో క్విట్ ఇండియా స్తూపం వద్ద జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, సభ్యుడు ఉండపల్లి రమేష్ నాయుడు, కంతేటి వెంకటరాజు, జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాద్ రాజు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ప్రసంగించారు.

పల్లెల అభివృద్ధే ధ్యేయం: నిమ్మల

పాలకొల్లు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. కాపవరం, వలమర్రు, అరట్లకట్ట గ్రామాల్లో రూ. కోటి 80 లక్షల విలువైన పలు అభివృద్ధి పనులకు మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. సీఎం చంద్రబాబు హామీలు అమలు చేస్తున్నారన్నారు. మండలంలోని భగ్గేశ్వరంలో శుక్రవారం ఉదయం సామాజిక పెన్షన్లు మంత్రి పంపిణీ చేశారు.

పాలకొల్లు టౌన్: నిరుపేదలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో ప్రయివేటు ఆసుపత్రుల్లో వైద్యసేవలు పొందిన 28 మంది లబ్ధిదారులకు రూ.11.28 లక్షలు సీఎం సహాయ నిధి చెక్కులను మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, కూటమి శ్రేణులతో కలిసి పంపిణీ చేశారు.

ఆచంట: 9 మందికి 13 లక్షల 10 వేల 619 రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అందజేశారు. శుక్రవారం భీమలాపురం, ఆచంటలో జరిగిన కార్యక్రమంలో కొమ్ముచిక్కాలలోని క్యాంప్ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు అందజేశారు.

అర్హులందరికీ పింఛన్లు: ఆరిమిల్లి

తణుకు/ఇరగవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధికారంలోకి వస్తే ఇంటింటికి పింఛన్లు వెళ్లవని తప్పుడు ప్రచారం చేశారని, ప్రతినెలా ఉదయం ఆరు గంటలకే పింఛన్లు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని 7వవార్డులోని, ఇరగవరం మండలం ఈస్టువిప్పర్రు, తణుకు మండలం మహాలక్ష్మిచెర్వు గ్రామాలలో స్వయంగా వెళ్ళి పింఛన్ సొమ్ములను అందజేసారు. ఈ సందర్భంగా అర్హులు ఎంతమంది ఉన్నా అందరికి అందిస్తామన్నారు. నియోజకవర్గంలోని 15 కోట్ల 16లక్షలు 36 వేల 618 మంది లబ్దిదారులకు అందిస్తున్నట్లు ఆయన వివరించారు.

పాలకోడేరు: పింఛన్ల ద్వారా ప్రభుత్వం పేదలను ఆదుకుంటోందని జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. మొగల్లులో శుక్రవారం ఆయన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని అరుంధతి కాలనీలో ఉన్న మురుగుబోదిని పరిశీలించి గ్రామంలో సమస్యలు పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పెంటపాడు: ఎన్నికల హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. మండలంలోని మౌంజిపాడు, జట్లపాలెం, పట్టణం లోని పలు వార్డులలో శుక్రవారం పెన్షన్లు పంపిణీ చేశారు.

రెండిళ్లలో చోరీ

నరసాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చోరీలు ఆగలేదు. మొగల్తూరు రోడ్‌లో నివాసం ఉంటున్న కేసరి గంగరాజు ఇంటి తాళం పగలగొట్టి 340గ్రాముల వెండి, సమీపంలోని 18వ వార్డులోని కొండా శ్రీధర్ ఇంటిలో ఇంటి తాళం పగలకొట్టి 500 గ్రాముల వెండి, రూ. 7వేల నగదు చోరీ చేశారు. ఒకే రోజు రెండు నివాసాల్లో దొంగతనాలు జరగడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. పోలీసులు డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్‌లను రప్పించారు. సీసీ కెమెరాలో దొంగల ఆనవాళ్లు చిక్కాయి. దీని ఆధారంగా పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఘటనా స్థలాలను సీఐ యాదగిరి, ఎస్సైలు ముత్యాలరావు, జయలక్ష్మిలు పరిశీలించారు.

కలెక్టర్ పాఠశాల తనిఖీ

పాలకొల్లు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌చిక్కాల జెడ్పీహైస్కూల్‌ను జిల్లా కలెక్టర్ సిహెచ్ నాగరాణి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతీ వారు ఇంజనీర్ లేదా డాక్టర్ కావాలని అనుకోరాదని, సాంకేతిక విద్యావకాశాలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. హెచ్‌ఎం రాము, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

మావుళ్ళమ్మను దర్శించుకున్న ఉప లోకాయుక్త రజని

భీమవరం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ అమ్మవారిని రాష్ట్ర ఉప లోకాయుక్త పి. రజని దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరపున శేషవస్త్రాన్ని, ప్రసాదాన్ని, జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి సుబ్బారావు, ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ అందించారు. వారి వెంట డీఎస్పీ సుబ్బారెడ్డి, తహసిల్దార్ రాంబాబు తదితరులు ఉన్నారు.

లోక కల్యాణార్థం మహాయాగం

తణుకు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంలో ప్రముఖ సిద్ధాంతి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాయాగంలో పాల్గొన్నారు. లోకకల్యాణార్థం 15 రోజుల పాటు జరుగుతుందని, ప్రజలంతా పాల్గొనాలని కోరారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

తణుకు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్‌లో క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. శుక్రవారం క్లబ్ సెక్రటరీ కఠారి సిద్ధార్థ పుట్టిన రోజు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎస్‌సీఐఎం ప్రభుత్వ కళాశాలలో తమిళనాడు లోని సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైన 20 మంది క్రీడా కారులకు పదివేలు విలువగల దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఆనందం మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పశుగణన జయప్రదం చేయాలి

పెంటపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పశుగణన జయప్రదం చేయాలని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి. క్రాంతి అన్నారు. శుక్రవారం మండలంలోని జట్లపాలెం గ్రామంలో 21 వ జాతీయ పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ క్రాంతి మాట్లాడుతూ రైతుందరూ పశుసంవర్ధక శాఖ సిబ్బంది అడిగిన వివరాలు తెలిపి సహకరించాలని కోరారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

పెంటపాడు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్మిక హక్కులను కాపాడేందుకు ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తుందని ఏఐటీయూసీ ఏరియా సంయుక్త కార్యదర్శి కళింగ లక్ష్మణరావు అన్నారు. పెంటపాడులో ఏఐటీయూసీ 105 ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బి.లక్ష్మి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉప్పాటి సింహాచలం, కోనా రాజేష్, రాజు , డాలయ , వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి

భీమవరం టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్‌లో ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ అప్పారావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పూల మాలలు వేసి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. విద్యాశాఖ సహాయ సంచాలకులు సంధ్య తదితరులు పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం ఆంధ్రుల చరిత్రలో సువర్ణధ్యాయమని భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సరిపిడకల రామారావు అన్నారు. కాలనీలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద శ్రీ విజ్ఞానవేదిక, అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినో త్సవాన్ని నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, కార్యదర్శి కుక్కల బాల, జానపాటి మధుసూధన్ రావు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ప్రసంగించారు.



కలెక్టరేట్‌లో పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళలర్పిస్తున్న దృశ్యం

గణపవరం: తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని మెడికల్ షాపుల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సుబ్బరాజు నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని గణపవరం, నిడమర్రు మండలాల మెడికల్ షాపుల సంఘం ఆధ్వర్యంలో గణపవరంలో శుక్రవారం నిర్వహించారు. శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంకు ఉమామహేశ్వరరావు, కామిరెడ్డి నాగేశ్వరరావు, నంద్యాల సోమరాజు, సీహెచ్.సత్యనారాయణ పాల్గొన్నారు.

పెనుగొండ: పెనుగొండ పంచాయతీ వద్ద రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్ వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎంఆర్‌సీని సందర్శించిన డీఈవో

పాలకొల్లు అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎంఆర్‌సీ కేంద్రాన్ని డీఈవో నారాయణ శుక్రవారం సందర్శించారు. ప్రభుత్వ ప్రైవేటు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ విద్యార్థుల అపార్ కార్డులు తయారు చేయడంలో ఏమైన సమస్యలుంటే ఎంఈవోను సంప్రదించాలని సూచించారు. ఈ నెల 14న జరిగే పేరెంట్స్ కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని, పేరెంట్స్‌ను మోటివేషన్ చేయాలన్నారు.

మతోన్మాద శక్తుల్ని అరికట్టాలి

నరసాపురం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మతోన్మాద శక్తులకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయకుంటే కులచిచ్చు రగిలే ప్రమాదం ఉందని నరసాపురం పాస్టర్స్ అసోసియేషన్ నాయకుడు యాతిరాజుల రూబేన్ ఆవేదన వ్యక్తం చేశారు. స్టేషన్‌పేటలోని ఫెయిత్‌హోమ్ చర్చి ప్రాంగణంలో పలువురు పాస్టర్లతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కొన్ని మతోన్మాద శక్తులు కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు యత్నిస్తున్నాయన్నారు. పాస్టర్లు ప్రకాశ్, శ్యాంబాబు, జాషువ, శ్యామ్, కృపవరం, డేవిడ్, కృపారావు, బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

కందిపప్పు పంపిణీ తప్పనిసరి

పోడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్డుదారుడుకీ బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు కూడా పంపిణీ చేయాలని పోడూరు తహసీల్దార్ మహమ్మద్ సయ్యద్ ఫాజిల్ రేషన్ డీలర్లను, ఎండీయు వాహనదారులను ఆదేశించారు. శుక్రవారం వెలగలమ్మ చెర్వు ఏరియాలో రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్న ఎండియు వాహనాన్ని, రేషన్ దుకాణాలను ఆయన పరిశీలించారు. ఆర్ఐ, వీఆర్వోలు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలలో నిర్వహించిన జోనల్ సైన్స్ ఫెయిర్‌లో పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు వారిని అభినం దించారు. డ్రోన్‌ల వినియోగంపై విద్యార్థుల ప్రయోగాలు అబ్బుర పరిచాయి. ప్రిన్సిపల్ రాజారావు, సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. జోనల్ నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని ప్రిన్సిపల్ రాజారావు వివరించారు.



పైడికొండలకు ఘన నివాళి

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు పైడికొండల మాణిక్యాలరావు జయంతి సందర్భంగా శుక్రవారం తాడేపల్లిగూడెంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పుష్పాంజలి ఘటించారు. అనంతరం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు ముప్పిడి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధరాఘాతంతో ప్రజల వెతలు : కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అయిదు నెలల కాలంలో ప్రజలు ధరాఘాతంతో ఇబ్బంది పడుతున్నారని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలపై త్వరలోనే పార్టీ ఆదేశాల మేరకు ప్రజల పక్షాన పోరాడతామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాళీమాత పూజ

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలోని బెంగాలీ స్వర్ణ శిల్పులు దీపావళి సందర్భంగా కాళీమాత ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కాళీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలు ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఆ సంఘ తాడేపల్లిగూడెం అధ్యక్షుడు దువ్వా శ్రీను పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలోనే 300లకు పైగా క్లెయిములు ఉన్నాయన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలి: జేసీ

భీమవరం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆ దేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, సహకార సంఘాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో పంట కోత షెడ్యూలు తయారు చేసుకుని ఎప్పటికప్పుడు కావలసిన గోనె సంచెలను



వాహనాలు ద్వారా రవాణా చేయుటకు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి జెడ్. వెంకటేశ్వర రావు, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ టి. శివరామ ప్రసాద్, జిల్లా కో- ఆపరేటివ్ అధికారి ఎం. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పిప్పరలో ఇందిర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హరికుమార్‌రాజు

ఇందిర ఆశయాలు నెరవేరుస్తాం : పాతపాటి

గణపవరం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): దేశంలో పేదరిక నిర్మూలనకు మాజీ ప్రధాని ఇంధిరాగాంధీ పాటుపడ్డారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు అన్నారు. ఇందిర జయంతి సందర్భంగా శుక్రవారం పిప్పర పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గణపవరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జీడికుంట్ల చంద్రశేఖర్, పార్టీ నాయకులు నంబూరి రామకృష్ణంరాజు, పాతపాటి కొండరాజు తదితరులు పాల్గొన్నారు.

యాచకులతో కలసి దీపావళి వేడుకలు

గణపవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హిందూ హైందవ సంప్రదాయాతో జరుపుకునే దీపావళి పండుగను యాచకుల మధ్య జరుపుకోవడంతో సంతృప్తినిచ్చిందని వివేకానంద సేవాసమితి అధ్యక్షుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు అల్లూరి గంగరాజు అన్నారు. గణపవరంలోని సంత మార్కెట్ షెడ్లలో నివాసం ఉన్న యాచకులు, వృద్ధులు, పిల్లలతో కలిసి దీపావళి ఘనంగా నిర్వహించారు. బాణసంచా, స్వీట్లు, పిండివంటలు పంపిణీ చేశారు.